

# మనిషికి మరో చిరునామా

అంగ రంగ వైభోగంగా రాత్రి పెళ్లయిందక్కడే. ఆ కళ్యాణమంటపమే ఎందరో యువతీ యువకులను మూడుముళ్ల బంధంతో జంటలుగా మార్చింది. రాత్రి జరిగిన పెళ్లి... దాన్నో కొంగలు తొక్కిన మడుగులా మార్చేసింది. "విక్కీ! అమ్మ రమ్మంటోంది... కూరగాయలు తెవాలట!" వెనకనుంచి అలికిడి వినబడింది. కళ్యాణమంటపంలో కుర్చీలు సర్దుతున్న వివేకానంద భుజానికి మెత్తగా తగిలిందో స్పర్శ. అది సుమంగళి చేతి స్పర్శ... వెన్నుపూసకు వెన్న రాసినట్టు హాయిగా ఉంది. జీవనయానంలో ఆశల ఆరాటాన్ని అదిమిపెట్టుకున్న శేఖరం... కళ్యాణమంటపం మేనేజర్. ఆయన భార్య సుభాషిణి, ముద్దుల కూతురు సుమంగళి నోళ్లల్లో వివేకానంద పేరు కరిగి విక్కీగా రూపాంతరం చెందింది. తనకంటే చిన్నదైన సుమంగళి కూడా అలాగే పిలిచినా, తనకు బాగానే అన్పిస్తుంది. "చూడు సుమా! నిన్న సాయంత్రం సర్దిన కుర్చీలు తెల్లారేసరి కెట్లాగైనయో! ఫుట్‌పాత్ సరుకుల్లా అడ్డదిడ్డంగా పడిపోయినై. పెళ్లికొచ్చిన చిన్న పిల్లలకివి ఆటవస్తువులు. పెద్దల నిర్లక్ష్యం కూడా..." ఆవేదన వెలిబుచ్చుతూ కుర్చీలను మూలకు సర్దేశాడు. అలసటనంతా నిట్టూర్పుతో ఉపశమింపజేసుకుని సుమంగళి కళ్లలోకి సూటిగా చూశాడు. కిశోర వయసులో ఉన్న అతనికి ఆమె బుట్టబొమ్మలా కనబడింది. పెదాలమీద చెరగని చిరునవ్వు. వెన్నెల వెలుగులో మల్లెపూవులాగుంది. పరికిణీ, జాకెట్టుతో... 'సీతమ్మ బాల్యం' పాఠంలో తెలుగు మాస్టారు వివరించి చెప్పిన పద్యం లాగుంది.

సంచీ అందుకుని కూరగాయలకి వెళ్లబోతుంటే శేఖరం సారు "సుభా! వాడిప్పుడు పదోతరగతి. పబ్లిక్ పరీక్షలు. బాగా చదువుకోవాలి. పనులన్నీ వాడికే పురమాయిస్తే ఎట్లా?" అంటూ భార్యను మందలించాడు. ఆవిడూరుకుంటుందా? "మీరేమో పొద్దున్నే

బయటికెల్తిరి. నాకు వంటపని, ఇంటిపని. ఓవైపు అందరికీ టైమవుతుంది. ఇప్పుడు మార్కెట్‌కెవరెళ్లాలి?" వంటింట్లోంచే నిలదీసింది. ఫరవాలేద్సార్! రాత్రి పదిదాకా, మళ్లీమబ్బులనే నిద్రలేచి చదువుకున్నా. చూస్తుండండి. ఫస్ట్‌క్లాసులో పాసై మీ పేరు నిలబెడ్తా!". "నేను వెళ్లిరానా నాన్నా?" సుమంగళి ముందుకొచ్చి సంచీ లాక్కోబోయింది. తానొప్పుకోలేదు. సార్ పెదాలు చప్పరించాడు. "ఏమోరా విక్కీ! వద్దన్నా వినకుండా కళ్యాణ మంటపంలో పంచేసి కూలి సంపాదిస్తావు. నీ పుస్తకాలు నువ్వే కొనుక్కుంటున్నావు. నువ్వు మాకేమీ భారం కాదురా బాబూ"...పొద్దంతా కంప్యూటర్ ప్రోగ్రాముల్లో మమేకమై, సాయంత్రం గదికొచ్చి సోఫాకొరిగిన సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ వివేకానందకు బాల్యస్మృతులు తెరలు తెరలుగా నెమరుకొస్తున్నాయి. ఎప్పుడు తీరిక దొరికినా అవే చర్విత చర్వణం... రిపీటెడ్ టీ.వీ. సీరియల్స్‌లా మెదడు పొరల్లో దొర్లుతూ తియ్యని అనుభూతి కల్గిస్తుంటాయి.

'ఏదన్నా తెలుగు సినిమాకెళ్తే బావుంటుందేమో. ఈ బెంగళూరు సిటీలో తెలుగు సినిమాలకేమీ కొదవలేదు' అనుకుంటూ పేపరందుకుని సినిమా డైరీ చూశాడు. 'నిన్న, ఇవాళ రిలీజైన సినిమాలకు అడ్వాన్స్ బుకింగ్. పాత సినిమాలు చూసినవే కాబట్టి, పాతబారబోతున్న కొత్త సినిమాకెళ్లడం మంచిది' అనుకున్నాడు వివేకానంద. అనుకోకుండా ముఖ్యమంత్రిని చూసిన పోలీసాఫీసర్లా గబుక్కునలేచాడు. మొహం కడుక్కోగానే, మెదడు పొరల్ని ఉతికి ఆరేసినట్టు... ప్రశాంతంగా ఉంది. ట్రిమ్ముగా తయారై హుషారుగా బయటికి రాబోతున్నాడు. సెల్‌ఫోన్ రాగమందుకుంది. 'అబ్బా! ఈ సెల్‌ఫోన్ నెవడు కనిపెట్టాడో కానీ... పానకంలో పుడక!'... అందుకున్నాడు. "హల్లో!" అలర్టయ్యాడు. "ఆ... ఆ... బాగున్నాను సార్. డ్యూటీ ఐపోయింది. ఇంటికొచ్చి కొద్దిసేపైంది. అంతా బాగున్నారా సార్?". "నువ్వు వెంటనే రావాలిరా". "ఎందుకు సార్? ఆంటీ, సుమంగళి బాగున్నరా?" "ఏదో ఉన్నారు కానీ, నువ్వు అర్జంట్‌గా రావాలిరా. వచ్చింతర్వాత అన్నీ చెప్తాను కదా? గాభరాపడొద్దు సుమా!". "సరే.. సా.. ర్..!"

ముత్యాల పెళ్లిపందిరి, అరిటాకుల స్వాగత ద్వారాలు, నవ్వుతున్న పూలదండలతో కల్యాణ మంటపం పెళ్లికూతురులా తయారైంది. అరగంటలో అంతా నిండిపోయింది. వేదమంత్రాలు, నాదస్వరాల సాక్షిగా వధూవరుల మనసులొక్కటైపోయినై, మూడు ముళ్లు పడిపోయినై. సెంచరీ సాధించిన మిడిలార్డర్ బ్యాట్స్‌మెన్‌లా వధువు తండ్రి తృప్తిగా ఊపిరి పీల్చుకున్నాడు. నవ వధూవరులు మహారాజా కుర్చీల్లో కొచ్చారు. బంధుమిత్రులు... కూచున్న కుర్చీలను తోసేస్తూ, వరుసగా వచ్చి కొత్త జంటను ముసిముసినవ్వుల అక్షింతలతో ఆశీర్వదిస్తున్నారు.

వెంటనే భోజనశాలలో దూరిపోతున్నారు. వంటకాల ఘుమఘుమలు ఆకలిని కవ్విస్తున్నాయి. బఫే భోజనం... సమాజ చైతన్యానికి అద్దం పడుతోంది. ఎవరికి నచ్చిన పదార్థాలు వారి ప్లేట్లల్లో పడిపోతున్నాయి. పెళ్లివారి తరఫున రంగంలోకి దిగిన కార్యకర్తలకు చేతినిండా పని. ఓ వైపు వీఐపీలకు స్వయంగా వడ్డిస్తూ, మరోవైపు ఆహ్వానించని అతిథులను, పరాన్నభుక్కులను నిర్దాక్షిణ్యంగా పంపేస్తున్నారు. ఏడేళ్ల పిల్లవాడు ఖాళీ ప్లేటందుకుని దర్జాగా లైన్లో నుంచున్నాడు. చిరుగులషర్టు, మాసిన చెడ్డీ, చెదిరిన జుట్టు, బెదురు చూపులు...! ఓ కార్యకర్త డేగకళ్లల్లో చిక్కుకున్నాడు.

"బాబూ! నువ్వెవరూ?" దగ్గరికొచ్చి సూటిగా అడిగాడు. "న్నే...నా...నే...నూ..." నీళ్లు నమిలింది పసితనం. "ఓర్నీ"... కోపం నషాలానికంటిందేమో. "నిన్నెవరు రమ్మన్నారు బే?" అంటూ ప్లేటు లాక్కున్నాడు. భోరుమన్నాడు బాలుడు. కార్యకర్త ఆగలేకపోయాడు. "ఈ బేకార్ బాడ్కావు పోరల్తో నిదే పరేశాన్..." గొణుక్కుంటూ గల్లా అందుకుని వెంటనే మంటపం మేనేజర్ ముందుకు లాక్కెళ్లాడు. "వీడెవడో పోరంబోకు పోరడు. దొరలెక్క భోంచేస్తున్నాడు. ఇసొంటోల్లు ఎంత మందున్నరో! వాచ్‌మెన్ ఏం చేస్తున్నట్టు? వాని..." దండక మందుకున్నాడు. మేనేజర్ వింత చూపులు పిల్లాడిని ఆపాదమస్తకం తడిమాయి. పిల్లాడి కళ్లనిండా నీళ్లు, ఒంటినిండా వణుకు... చేతులెత్తి దండం బెట్టాడు. మేనేజర్‌కంతా అర్థమైంది. ఏదో గుర్తుకొచ్చినట్టుగా "వీడా! వీడు మావాడేనండీ. ఒరేయ్! ఇదేంపనిరా? ఏమిటీ అవతారం! ఇవ్వాళ బడిలేదా?"... దగ్గరకు లాక్కున్నాడు. బాలుడికి అదంతా అయోమయం.

ఫిర్యాదు చేసేందుకు పోలిస్‌స్టేషన్ కెళ్లి ముద్దాయిగా మారినట్టు... కార్యకర్త నాలిక్కరుచుకుంటూ వెళ్లిపోయాడు. మేనేజర్ ఊపిరి పీల్చుకుని, "నువ్వెవరు బాబూ?" అనునయంగా అడిగాడు. అప్పటిదాకా ఊపిరి బిగపట్టిన పిల్లాడు వెక్కుతున్నాడు. మరింత దగ్గరకు లాక్కుని చేతి గుడ్డతో కళ్లద్దుతూ... "అరేరే! ఏడవద్దు. నిన్నేమీ అనను కానీ... తప్పిపోయి వచ్చినవా?" తల నిమిరాడు. ఆప్యాయత... భయాన్ని తరిమేసింది. మాది బంజారుపల్లె సార్! మా అమ్మ చచ్చిపోయింది. మా ఇంటికో పిన్ని వచ్చింది. నాన్న సారా తాగి చచ్చిండు. పిన్ని బడికి పోనియ్యది. రోజూ కొడుతుంది సార్!"... భోరుమన్నాడు. "అయితే పారిపొయ్యొచ్చినవా?". "అనున్సార్... పిన్ని నన్ను చంపేస్తుంది. నేను సదూకుంట సార్! ఆకలైతుంది సార్!"... కాళ్లను చుట్టేశాడు. మేనేజర్ గుండెల్లో అష్టమ సముద్రం పొంగిందేమో... "లే బాబూ లే!" లేవనెత్తి బుజ్జగించి ఇంటికి తీసుకెళ్లాడు. భార్యకంతా చెప్పేశాడు. "మనకు పిల్లల్లేరని ఏ పిల్లగాన్నన్నా సాదుకుందామంటివి గదా! వీడు మన

దగ్గర్నే ఉంటదు, బడికివోతడు. ఇప్పుడు వానికన్నం బెట్టు". భార్య కళ్లు చేటలైపోయినై... కళ్లల్లో ఆనందం తళుక్కుమంది. పిల్లాడిని గుండెలకు హత్తుకుంది. "నా బంగారు కొండా!"... మెత్తని చెంపల్ని సుతిమెత్తగా ముద్దాడింది.

"మరి.. వీని పేరేమిటీ?" ఆత్రంగా అడిగింది భర్తను. "తెలీదు కానీ.. ఇప్పట్నుంచి వీడు వివేకానందుడు. ఈ పేరుతోనే బడిలో చేర్పిస్తా"... భూతల విమానమనే గరుడ బస్సు చిన్న కుదుపుతో ఆగింది. బాల్యగతంలోంచి వర్తమానికొచ్చాడు వివేకానంద. బస్సు కిటికీ తెరిచి చూశాడు. చల్లని గాలి తెర... ముఖప్రక్షాళన చేసింది. సృష్టికర్త లీలావిలాసాన్ని తలలాడిస్తూ చూపిస్తున్న చెట్లకొమ్మలు స్వాగతం పలికినై. స్టేషన్ జడ్చర్ల బస్టాండు అది. సాయంత్రం ఆరింటికి బెంగళూరులో గరుడలో కూచున్నాడు. పక్క పాసింజర్తో పరిచయమైంది. కాస్సేపు కబుర్లతో కాలక్షేపం... చిక్కమగుళూర్లో అందరితో పాటుదిగి భోంచేశాడు. తిరిగి బస్సెక్కి కూచోగానే, నిద్రాదేవి ఒడిలోకి లాక్కుంది. కర్నూల్‌లో మెలకువొచ్చింది.

'సార్... అంత అర్జంటుగా ఎందుకు రమ్మన్నాడో'!... ప్రశ్నా బాణం పురుగై తొలుస్తోంది. వెంటనే మనస్సు పొరల్లో బాల్యస్మృతి రంగుల చిత్రమై కదలాడింది. జడ్చర్లలో ఇంకా తెల్లవారలేదు. కొందరితో పాటు కిందికి దిగాడు. పున్నమి కదూ! ఆకాశంలో చందమామ... మబ్బు కన్యలతో దాగుడుమూత లాడుకుంటున్నాడు. కాకా హెూటల్లో గరం చాయ... నరాల స్వరాలతో వెచ్చని రాగాలు పలికిస్తోంది. ఎదురుగా ఓ యువతి... తనలాగే చాయా నందాన్ననుభవిస్తోంది. "హబ్బ! అప్సర్సలాగుంది. సుమంగళి ఇట్లానే ఉంది. ఇప్పుడేం చేస్తోందో!"... సుమంగళి రూపం ఎద తెరమీద ప్రత్యక్షమైంది. మనసు పొదలో మలయమారుతం వీచింది. పాపం! ఎంత అందగత్తెనో అంత అమాయకురాలు. రెక్కలు లేని గరుడ... చక్రబలం చూపుతూ పరుగెడుతోంది. కిటికీలోంచి బయటకు చూశాడు. ఓండాకాలం.. చల్లని గాలితెర తల్లిప్రేమలా తడిమింది. వింత గిలిగింత. 'ఇవ్వాళ్ల శని. రేపు ఆదివారం... వీకెండ్ సెలవులే. కానీ... అంత అర్జంట్ పనేమిటో! ఎందుకు రమ్మన్నారో!'... అంతరాళాల్లోని సందేహాలు మళ్లీ గతంలోకి లాక్కెళ్తున్నాయి... సార్ తనను బడిలో చేర్పించాక, సంవత్సరంలోగానే సుమంగళి పుట్టడం, సార్‌కు ట్రాన్స్‌ఫరవడం, ఆ తర్వాత ప్రమోషన్ రైలెక్కి హైద్రాబాద్ చేరడం... ఎక్కడి కెళ్లినా తనను వెంట తీసుకెళ్లడం, రాత్రికి దగ్గరుండి చదివించడం... టీ.వీ. సీరియల్ ఎపిసోడ్స్‌లా కదుల్తున్నాయి.

ఆంటీ ఎంత ఉత్తమురాలో! తల్లి ప్రేమకు దూరమైన తనను కన్నతల్లిలా ఆదరించింది. ఆనాడు.. చంటిగుడ్డు సుమంగళిని ముద్దాడుతూ సార్‌తో "మన విక్కీది లక్కీపాదమండీ.

వాడు మనింట్లో అడుగు పెట్టిన వేళా విశేషమే విటోగాని మనకు సంతాన సౌభాగ్యం చేకూరింది" అంది తనను ఆప్యాయంగా చూస్తూ. వెంటనే సార్ "అవును సుభా! వాణ్నికన్న తల్లిదండ్రుల దురదృష్టం మనపాలిటి అదృష్టమైంది"... ప్రేమగా తలనిమిరాడు. ఒళ్లు పులకరించింది. సారు దేవుడిలా, ఆంటీ దేవతలా కన్పించారు. ఆ రోజు... కళ్యాణ మంటపంలో పెళ్లివారి కార్యకర్తలాగా సార్ చీదరించుకుని బయటకు గెంటేస్తే... తన గతి ఏమయ్యేది? బస్టాండ్‌లో జేబులు కొడుతూనో, బజార్లో అడుక్కుతింటూనో బతకాల్సి వచ్చేది. డిగ్రీ పూర్తవగానే యంసీఏలో సీటొచ్చింది. ఫీజు వెంటనే కట్టాలన్నారు. అందుకోసం సారు... ఆంటీ మెడలోని బంగారుగొలుసు అమ్మేస్తానన్నాడు. 'నా చదువుకోసం ఆంటీ మెడ గొలుసెందుకమ్మాలి?'... తాను ఒప్పుకోలేదు.

"నేనింక చదవను సార్! ఈ డిగ్రీతో ఏదో ఉద్యోగం దొరక్కపోదు. ఇప్పటికే మీకెంతో రుణపడుతున్నాను"... హృదయవేదన బయటికి కక్కేశాడు. సారుకామాట ఏమాత్రం రుచించలేదేమో...? "విక్కీ! నువ్వు దీన్ని రుణంగా భావిస్తే మా మనసు గాయపడ్తుందిరా. మళ్లీ అట్లా మాట్లాడ్తే మామీద ఒట్టే..." సున్నితంగా మందలించాడు. "ఇలా మాట్లాడింది నువ్వేనా విక్కీ?"... ఆంటీ చిన్నబుచ్చుకుంది. సుమంగళి గుర్రుగా చూసింది. ఆ చూపుల్లో 'నువు మమ్మల్ని అర్థంచేసుకుంది ఇంతేనా?' అనే సవాలుంది. తన నోటికి తాళం పడింది. బంగారు గొలుసు...ఆంటీ మెడలో ఉన్న ఒకే ఒక నగ... బజార్లో అమ్ముడుపోయింది. యంసీఏ చదువు ముందుకు సాగింది. చదువు తపస్సుగా పరిణమించింది. ఫస్ట్‌క్లాసు సాధించింది. హైద్రాబాదులోనే ఆఫరొచ్చింది. యంసీఏ తర్వాత ఓ సంవత్సరం స్పెషల్ ట్రయినింగ్ ఇచ్చిన బెంగళూరు కంపెనీయే... ఉద్యోగమిచ్చింది. ఆంటీ, సారు చెరో పిడికెడు పంచదార తన నోట్లో పోశారు. కళ్లు మిటకరిస్తూ చప్పరిస్తుంటే.. సుమంగళి సంతోషంతో ఎగిరి గంతేసింది. ఆ రోజంతా పండగ వాతావరణమే.

బెంగళూరు వెళ్లేందుకు తయారవుతుంటే సుమంగళి తన ముందుకొచ్చి నుంచుంది. ముద్దమందారం మొహం ముడుచుకుపోయినట్టుంది. కళ్లల్లో మంచుతెరలు... "విక్కీ! మళ్లీ ఎప్పుడొస్తావు?" నున్నని చెంపల్ని ఒరుసుకుంటూ సన్నని అశ్రుబిందువులు ముత్యాల్లా జారి గుండెల మీద పడ్తున్నాయి. తాను చలించిపోయాడు. 'దిక్కులేని నాకు... అందరూ ఉన్న సుమంగళి గుండెగూటిలో చోటున్నదేమో!' "ఇదేంటి సుమా! డిగ్రీ స్టూడెంటువి. నువ్వేనా ఇలా...? నేనెటుబోతాను? సారు, ఆంటీలు నాకారాధ్య దేవతలు. ఎప్పుడు రమ్మంటే అప్పుడు రెక్కలు కట్టుకుని వాల్తాను గదా!" అంతరంగ తరంగాల్లో తియ్యని కదలిక.

+

నునులేత సూర్యకిరణాలు హైద్రాబాద్ నగర సుందరి అందాలకు బంగారు పూతలు పూస్తున్నాయి. సుమారు మూడేళ్ల తర్వాత మళ్లీ హైద్రాబాద్‌లో...! ఒళ్లంతా పులకింత. ఉద్వేగాన్నదిమిపెట్టి ఆటోదిగాడు వివేకానంద. ఆత్రంగా ఇంట్లోకొచ్చి అటూ ఇటూ చూస్తున్నాడు. "బాగున్నావా విక్కీ?"... ఆంటీ ఎదురొచ్చింది. ఆమె చిరునవ్వులో జీవం లేదు. "ఎప్పుడు బయల్దేరినవూ?". "బాగున్నానాంటీ. రాత్రికే బయల్దేరిన" సార్ గదిలోంచి బయటికొచ్చాడు. ఆ అడుగుల్లో ముందటి హుందాతనం లేదు. "హమ్మయ్య... వచ్చినవా విక్కీ! ముందు స్నానం చెయ్!"... గొంతులో ఆప్యాయత తగ్గలేదు. "సరే సార్!" అంటూంటే చూపులు సుమంగళిని వెతుకుతున్నాయి. లోలోపల ఏవేవో సందేహాలు సరిగమలు వినిపిస్తూంటే కాలకృత్యాలు, స్నానాదులు పూర్తయిపోయినై. వసారాలోని సోఫాల్లో సారు, సుమంగళి కూచుండి చాయ్ సేవిస్తున్నారు. వెళ్లి ఎదురుగా కూచున్నాడు. ఆంటీ రెండు చాయ్ కప్పుల ట్రేతో వచ్చి ఒకటి తనకందించింది. మరోటి తాను తీసుకుంది. కప్పు పెదాలకానించుకుంటూ పక్కన కూచుంది.

వాతావరణం గంభీరంగా, బరువుగా ఉంది. చాయోత్సాహం తన నరాల్ని కదిలించింది. "అంతా బాగేనా సార్?" ఖాళీకప్పు టీపాయ్ కప్పగిస్తూ ముగ్గుర్నీ అడిగాడు. బెంగళూర్లో నీకేమీ సమస్యల్లేవు గదా!" ఆంటీ కళ్లల్లో ముందటి మెరుపులేదు. "ఏమీ లేవు గానీ.. సుమంగళి డిగ్రీ పూర్తయింది గదా!" "అవును. దాంతోనే సమస్య వచ్చిపడింది. దానికి పెళ్లిచెయ్యాలి విక్కీ!" "అదో సమస్యనే కాదు గదా!" చూపుల్తో సుమంగళి నాపాదమస్తకం తడిమాడు. నిండు యవ్వనంలో పండులాగుంది. "పోయిన సంవత్సరమే దానికి పెళ్లి చెయ్యాలనుకున్నాము"... శేఖరం సార్ మొహంలో నీలినీడలు. "ఓ రోజు సరదాగా సిన్మాకని ఆటోలో బయలుదేరింది. సినిమా ఫక్కీలో ఆటోవాడే సందుగొందుల్లోంచి ఎటో తీసుకెళ్లి మారుమూల ఇంట్లోకి తోసేశాడట. సుమంగళి అరుపులన్నీ అరణ్యరోదనమైనాయట. లోపల ఎవడో బద్మాష్ దాని నోట్లో గుడ్డలు కుక్కి..." తుండు గుడ్డతో కళ్లద్దుకున్నాడు. "పశుబలం ముందు ప్రతిఘటన నిర్వీర్యమైందట..." మాట ఆగిపోయింది.

పంజేస్తున్న కంప్యూటర్లో కరెంటు పాసై షాక్ కొట్టినట్టైంది వివేకానందకు. "అయితే అదంతా ఎవడో ప్లాన్‌తో చేశాడన్నమాట". "నిజమే... కానీ... మూన్నెళ్ల తర్వాత మాకు తెలిసింది. అది నెల తప్పిందని"... ఆంటీ అందుకుంది. "అబార్షనైతే చేయించాం కానీ, వీధిలోని వారందరికీ తెలిసిపోయింది. ఆ తర్వాత రెండు మూడు పెళ్లి సంబంధాలొచ్చినా, పెళ్లివారికి అసలు విషయం మేమే చెప్పాం. వాళ్లు వెనక్కు తిరిగి వెళ్లారు. సుమంగళేమో

అసలు పెళ్లే చేసుకోనంటుంది. ఏం చెయ్యాలో...బాబూ"... గొంతు పూడుకుపోయింది. "మీతో చాలాసార్లు ఫోన్లో మాట్లాడాను గదా! నాకీ విషయమే తెలీదు" బాధగా ఆశ్చర్యపోయాడు. "ఏమని చెప్పాలి విక్కీ" సారు తలకొట్టుకున్నాడు.

సుమంగళి చూపులు తనమీదనే కేంద్రీకృతమైనాయి. ఆమె కళ్లు చిప్పిల్లి... మెరుస్తున్నాయి. 'సుమంగళి ఒంటికో గాయమైంది. దానికి చికిత్స గూడా జరిగిపోయింది కానీ... నా మూగప్రేమనెలా బయట పెట్టాలి?'... సతమతమైపోతున్నా గాంభీర్యాన్ని పులుముకున్నాడు. "నాకన్పిస్తుంది విక్కీ! ఈ ప్రాంతంలో ఏ సంబంధం చూసినా అసలు విషయం చెప్పాల్సి ఉంటుంది" మళ్లీ సారందుకున్నాడు. "బెంగళూరు సంబంధమేదన్నా నువ్వే వెతకాలి. వాళ్లకీ సంగతి చెప్పాలావద్దా అనేది నువ్వే నిర్ణయించుకో బాబూ!"... గొంతు వణికింది. సుమంగళి చూపుల్లో గాంభీర్యం. కొంగుతో కళ్లద్దుకుని గొంతు సవరించుకుంది. "విక్కీ! నా కోసం రిస్క్ తీసుకోవద్దు. నా మనసు దోచిన మనిషి గురించి అమ్మానాన్నకు చెప్పే అవకాశం రాకముందే దురదృష్టం కాటేసింది. ఇంత జరిగాక అతడు నన్నిష్టపడడు. నా కసలు పెళ్లయ్యేయోగం లేదేమో!"... పెదాలు వణికాయి. తల్లిదండ్రులు ఆశ్చర్యంగా మొహాలు చూసుకున్నారు.

'అయితే సుమంగళి ఎవరినో ప్రేమించిందన్న మాట. ఏది ఏమైనా నాదానిగా చేసుకుందామనుకుంటే... ప్చ్..లాభంలేదు. కానీ సుమంగళిని సుమంగళిగా చూడాలి...'. "నీ మనసు దోచిన మనిషెవరో చెప్పు సుమా! నేనతన్తో మాట్లాడ్తా. బతిమాల్తాను. కట్నమెంతడిగినా ఇస్తా. కాళ్లు పట్టుకుని అయినా సరే... పెళ్లికొప్పిస్తా..." వివేకానంద ఆవేశానికి పట్టుదల జోడైంది. సుమంగళి తల... స్ప్రింగ్‌లా పైకి లేచింది. "ఆ మనిషి.. నువ్వే విక్కీ!".

*(విపుల - డిసెంబర్ 2009)*